# సుఖజీవన సోపానం

నేనూ, నరసూ బాల్యమిత్రులం. బాల్యమిత్రులమేంటి? వసుధాచక్రం తన చుట్టూ తాను తిరుగుతూ, సంవత్సరానికోసారి సూర్యుని చుట్టూ తిరిగినట్టు, నేనూ నరసూ పుట్టేక ఈ ధరిత్రీ చక్రం ఇరవైనాలుగు పర్యాయాలు సూర్యుని చుట్టూ పరిభ్రమించిందని మా తల్లి దండ్రుల ఉవాచ.

సముద్రానికి వయస్సు పరిమితి దాటినా అది చెక్కుచెదరదు కాని, మా బోటి నిరుద్యోగులకు వయస్సు పరిమితి దాటితే చెదిరిపోక తప్పదు.

బియ్యే పూర్తి చేసుకుని ఐదేళ్ళయినా నాకూ నరసుకి ఎక్కడా ఉద్యోగాలు కలిసిరాలేదు. ఐదారు ఇంటర్వ్యూలకు వెళ్ళాము. ఒక్క ఇంటర్వ్యూ కూడా మమ్మల్ని వ్యూ చెయ్యలేదు.

వెయ్యి దేవుళ్ళకి కాకపోయినా కనీసం ఓ పదిహేనుమంది దేవుళ్ళకి మొక్కివుంటాం.

కొద్ది నెలల్లో మా వయసులు పాతిక దాటిపోతాయనగా, నాకు పాట్నాలో ఒక కేంద్ర ప్రభుత్వోద్యోగం వచ్చింది. నేను వెళ్ళి జాయినయిపోయాను.

"పోనీలేరా! భగవంతుడు నిన్నైనా కరుణించాడు. అంతే చాలు" అన్నాడు నరసు నన్ను రైలెక్కిస్తున్నప్పుడు.

నాకూ నరసుకీ ఉన్న ఒక మూజువాణీ ఒప్పందం ప్రకారం ఎవడికి ముందు ఉద్యోగం దొరికితే, వాడు రెండోవాడికి నెలకి ఓ పాతిక రూపాయలు చొప్పున పంపుతూండాలి. ఈ ఒప్పందం రెండోవాడికి ఉద్యోగం దొరికే వరకూ ఉంటుంది.

నేను పాట్నాలో ఉద్యోగంలో చేరేక మూడు నెలలపాటు నేను నరసుకి కట్టిన ఎమ్.ఓ. తిరిగు రసీదులు నాకు అందాయి. నాలుగు నెలల నుంచీ నా ఎమ్.ఓ.లు నాకు తిరిగి వచ్చేశాయి. దైవం కటాక్షించి వాడిక్కూడా ఎక్కడో ఉద్యోగం దొరికిందో ఏమో? అదీ మంచిదే!

నరసుకి నేను రాసిన ఉత్తరాలు కూడా తిరిగి వచ్చేశాయి.

మరో రెండేళ్ళలో, పాట్నాలోనే స్థిరపడిపోయిన మన తెలుగువాళ్ళ పిల్లనే నేను పెళ్ళి చేసుకున్నాను.

నాకిప్పుడు ఆరేళ్ళ కుమారుడు.

ఐతే దురదృష్టవశాత్తూ వాడికి పక్షవాతం వచ్చేసింధి. వాడు పుట్టిన వెంటనే బీసీజీ, ట్రిపుల్ ఏంటిజెన్ వంటి వేక్సినులు సకాలంలో ఇప్పించక పోవడం వల్ల ఇలా అయిందని మా వాళ్ళు కొందరంటూంటారు.

నాకు వచ్చే పరిమిత ఆదాయంలో మా అబ్బాయికి ఇప్పించ గలిగినన్ని మందు లిప్పించాను. దగ్గరలో వుండే పుణ్యక్షేత్రాలు దర్శించాను. రాతి దేవుళ్ళు కనికరించలేదు. పుణ్య నదీమ తల్లులు కూడా పసివాడికి ఆరోగ్యం ప్రసాదించలేదు.

"మీ తెలుగుదేశంలోనే ఉన్న భగవాన్ సుఖానంద బాబుగారు ఎట్టి దీర్ఘ రోగుల్నైనా స్పృశిస్తే, ఇట్టే రోగాలు నయమవుతున్నాయి. మేము ఈ మధ్యనే వెళ్ళి వచ్చాం. ఆశ్రమ వాతావరణం అదీ చాలా ప్రశాంతంగా ఉంటుంది." అని మా పొరుగున ఉన్న హిందీవాళ్ళు చెప్పేరు.

పోనీ ఏ పుట్టలో ఏ పాముందో-ఏ మహత్తుందో-అసలే భగవాన్ అంటున్నారు అని సుఖానంద బాబాగారి ఎడ్రసు రాసుకుని, మా అబ్బాయిని తీసుకుని మన పవిత్ర ఆంధ్రదేశానికి బయలుదేరేను. డబ్బు సర్దుబాటుకాక నా సతీమణి పాట్నాలోనే వాళ్ల వాళ్ళింట్లో ఉండిపోయింది.

మూకం కరోతి వాచాలమ్

పంగుం లంఘయతే గిరిమ్

యత్కృపా తమహం వందే
పరమానంద మాధవమ్

భగవంతుని కృపాకటాక్షం వుంటే సాధించలేనిదేమిటి? మూగవాణ్ణి మాటకారిని చేస్తాడు. కదలని కొండని లంఘింపజేస్తాడు! అటువంటి పరమేశ్వరునికి నమస్కరిస్తాను.

మూగవానికి వాగ్దానం చేసినవాడు, కదలని కొండని కదిలించేవాడూ, సకల చరాచర సృష్టికి కారణభూతుడు అయిన భగవంతుడు తల్చుకుంటే - సృష్టిలో అణ్వాతి అణవు అయిన నా కుమారుని పక్షవాతం నయం చేయడం ఒక లెఖ్ఖా?

బాబాగారి ఆశ్రమానికి చేరేను. ఆశ్రమ వాసులు-ఆశ్రమానికివచ్చే భక్తజనులపేర్లు, వృత్తి ఉద్యోగాలు, ఎందు నిమిత్తమై వచ్చినదీ, ఒక పుస్తకంలో నమోదు చేసేరు. భోజన వసతులన్నీ ఆశ్రమానివే.

కొంతసేపటికి బాబాగారు సమాధిలోంచి బయటకువచ్చి భక్తజనులందర్నీ తమ కరుణాకటాక్ష వీక్షణాలతో పునీతం చేసేరు.

"నీ పేరు వెంకటేశ్వర్లు కదూ!" అన్నారు.

నేనా? నన్నేనా పిలుస్తున్నది? నా పేరు వెంకటేశ్వర్లని బాబాగారి కెలా తెలిసిపోయింది?

ఇదే మనిషిని ఆవరించి వున్నమాయ భగవాన్ సర్వజ్ఞుడని తెలిసీ నాకేమిటీ అజ్ఞానం?

"నీ కొడుకు పక్షపాతం నయం కావాలని ఇక్కడి కొచ్చావు కదూ?" అన్నారు బాబాగారు గెడ్డం నిమురుతూ.

నేను స్టన్ అయిపోయాను.

"చిత్తం మహాప్రభో!" అన్నాను.

"నీ కుర్రవాణ్ని తీసుకుని లోపలికి రా" అని ఆదేశించారు.

బాబాగారి శిష్యులు నన్ను తోడ్కొని ఒక ఏకాంతపుగదిలోకి తీసుకు వెళ్ళేరు.

"స్వామీ! లే, నేను నీ శైశవ మిత్రుడు నరసుని" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను. "ఓరి నువ్వట్రా నరసూ! ఈ బాబా అవతారం ఎప్పట్నించిరా?"

"అన్నింటికన్నా సులభంగా బతికే మార్గం ఇదొక్కటే అని తెలుసుకున్నాను. ఓ భక్తుణ్ని సంపాదించాను. అతనిదే ఈ ఆశ్రమం జాగా. మెల్లగా అలా అలా శిష్యుల్ని కూడగట్టి ప్రచారం చేయించుకున్నాను. ఇప్పుడీ సుఖానంద బాబా అంతర్జాతీయ ఖ్యాతి గడించాడు" అన్నాడు నరసు, వురఫ్ సుఖానందబాబా.

"మరి దైవ శక్తులెలా సంపాదించావురా?" అడిగేవు,

"దైవశక్తులా పాడా! వొట్ఠి మేజిక్కులు, ట్రిక్కులు, టెక్నిక్కులు! రోడ్డు ప్రక్క గారడీవాణ్ని మంచిచేసుకుని వాడి చేతిలో ఓ పదిరూపాయలు పెట్టేను, వాడు ఇంద్రజాలాలన్నీ నేర్పేడు. నా శిష్యులైన డాక్టర్లు, ఇంజినీర్లు, విద్యావేత్తల చేత విస్తారంగా ప్రచారం చేయిస్తుంటాను. లేకపోతే నా ఆశ్రయానికి రాబడి వచ్చేదెలారా?" అన్నాడు బాబా.

"అంతంత డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు నీకు శిష్యులెలా అయేరురా! వాళ్ళకెక్కువగా హేతువాద దృష్టి వుంటుందే! వాళ్ళు సైన్సుని టెక్నాలజీని అదికంగా నమ్మతారుకదా?" అనడిగేను కుతూహలం చంపుకోలేక.

"నిజమే వాళ్ళు నిజానికి హేతువాదులే! అయితే వాళ్ళ దగ్గర బోల్డంత బ్లేక్‌మనీ ఉంటుంది. టేక్సులు ఎగ్గొడతారు. హఠాత్తుగా ఆర్థికశాఖాధికారులు వాళ్ళమీద దండయాత్రచేస్తే? అభాసుపాలయిపోరూ! అంచేత వాళ్ళ దగ్గరున్న బ్లేక్‌మనీని సేఫ్‌కస్టడీలో ఉంచమని నా కప్పజెప్తారు. అప్పుడప్పుడు వచ్చి వాళ్ళకు కావల్సిన డబ్బు తీసుకెళుతుంటారు. వాళ్ళు నన్ను ఆశ్రయించుకుని, నాకు దైవశక్తులూ మహత్తులూ ఉన్నాయని ప్రచారం చెయ్యకపోతే వాళ్ళు నా దగ్గర దాచిన డబ్బు - లేదు పొమ్మంటే? మొదటికే మోసంకదా! అందుకే, చచ్చినట్టు నా మేజిక్కుల్నీ ట్రిక్కుల్నీ, దైవమహత్తులనీ ప్రచారం చెయ్యక తప్పదు!" అన్నాడు బాబా.

"మరైతే చాలామంది రోగులు నువ్వు హస్తంతో స్పృశించగానే తమ తమ రోగాలు నయమై పోతున్నాయని చెబుతున్నారే!?" అనడిగేను ఉండబట్టలేక.

"అదీ కిమ్మత్తైన గమ్మత్తు, మహత్తు కాదు. ముందుగా రోగులు, నా దర్శనం చేసుకుంటేనేచాలు - సర్వ రోగాలు నశించి, మానసికంగా హాయిగా ఉంటామనీ దృఢవిశ్వాసంతో నా వద్దకు బయలుదేరుతారు. నా దర్శనం కాగానే వారికి నాయెడలగల

అచంచల విశ్వాసంవల్ల వారి రోగాలు నయం అయిపోయినట్లుగా ఫీలవుతారు. వ్యాధి బాధనుండి వారి మనస్సు, భగవంతుడినైన నామీదకు మరలిస్తారు. దాంతో, వ్యాధి పటాపంచలయినట్లు అనిపిస్తుంది. అదే వారి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది".

"ఇంతకీ మా అబ్బాయికి పక్షవాతం నయం చేయలేనంటావ్?" అన్నాను దిగులుగా, ఏడుపు మొహం పెట్టి.

"అది నావల్లకాదు. ఇలా అంటున్నందుకు మరోలా అనుకుని బాధపడకు. నయం అంటూ అయితే మందులవల్లనే అవాలి తప్ప బాబాల మహత్తులవల్ల అవుతుందనుకోవడం కల్ల. మహత్తుల వల్లే రోగాలు నయం అయిపోతే ఇన్ని ఆస్పత్రులెందుకు? మెడికల్ కాలేజీల్లో సీట్లకోసం ఇంత రద్దీ ఎందుకు? - నువ్వు నా శైశవ మిత్రుడివి కావడంవల్ల నీ దగ్గర నా రహస్యాలను దాచి మోసం చేయలేక వాస్తవం చెప్తున్నాను." అన్నాడు.

నా శైశవ మిత్రబాబా పచ్చి నిజాన్ని చెప్పేడని ఓ పక్క అభినందిస్తూ, మా అబ్బాయి పక్షవాతం పోనందుకు - శ్రీనాథకవి సార్వభౌముని భుజస్తంభ మెక్కెనుగదా నగరి వాకిట నుండు నల్లగుండు" అన్నట్లు బరువైన గుండెతో గృహోన్ముఖుడినయ్యాను.

జనసుధ మాసపత్రిక విజయవాడ